





సందడి సమాప్తం



● ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

- ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం
- ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ పోలింగ్‌కు అధికారుల ఏర్పాట్లు
- ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ ఆర్‌డీవో కార్యాలయాల్లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు
- జిల్లా వ్యాప్తంగా 33 మండలాల్లో 89 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- ప్రచారం ముగియడంతో మంతనాల్లో నిమగ్నమైన అభ్యర్థులు
- రేపు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు భారీ ఏర్పాట్లు

నిజామాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి మంగళవారం సాయంత్రంతో తెరపడింది. కొద్ది రోజులుగా రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, అభ్యర్థుల మాటల తూటాలతో హోరెత్తిన జిల్లాలో ఒక్క సారిగా నిశబ్ద వాతావరణం నెలకొంది. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగియడంతో అధికారులు పోలింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో గ్రాడ్యుయేట్‌తో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ పోలింగ్ కోసం నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, ఆర్‌డీవో కార్యాలయాల్లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల నుంచి బుధవారం పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ పేపర్లు, బాక్సులతో పాటు ఇతర సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లనున్నారు. కేంద్రాలలో వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాటు చేయడంతో పాటు భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరగనుండటంతో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు.

48 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

శివరాత్రి సందర్భంగా బుధవారం సెలవు ఉన్నా పోలింగ్ సిబ్బంది మాత్రం విధుల్లో ఉండనున్నారు. జిల్లాలోని మూడు ఆర్‌డీవో కేంద్రాల్లో ఉదయం పోలింగ్ విధులకు సిబ్బంది రిపోర్ట్ చేయనున్నారు. జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా 48 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని 33 మండలాల పరిధిలో కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు నిజామాబాద్ నగరం, ఆర్మూర్, బోధన్, భీంగల్ మున్సిపాలిటీ పరిధిలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 33పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ రెండు ఎన్నికల కోసం మొత్తం 81పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మొత్తం 31వేల 571 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో 3,751మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. ఈ ఎన్నికల కోసం మొత్తం 459 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం లో 1 పీవో, 1 ఏపీవో, 2 ఓపీవోలు చొప్పు మొత్తం నలుగురిని నియమించారు. జిల్లాలోని 89 పోలింగ్ కేంద్రాల్లో వీరిని నియామకం చేయడంతో పాటు అద నంగా 20 శాతం సిబ్బందిని రిజర్వులో ఉంచారు. వీరికి మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికలపై రెండు దఫాలు శిక్షణ ఇచ్చారు. ఈ ఎన్నికల సందర్భంగా పోలింగ్ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరగనుంది. ఎన్నికల పోలింగ్‌కు ముందే పార్టీ ఏజెంట్లతో పాటు అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్‌ను నిర్వహించనున్నారు.

255మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు

ఈ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ కొనసాగుతుంది. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మంగళవారం పరిశీలించారు. ఉద్యోగులు, పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు కలెక్టరేట్‌లో ఈ పోస్టల్ బ్యాలెట్ కోసం ఏర్పాట్లు చేశారు. పోలీసు బందోబస్తు మధ్యన ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. మొత్తం 255 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లను చేశామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేసే విధంగా ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే కలెక్టరేట్‌లోని సహాయ కేంద్రానికి సమాచారం అందించాలని ఆయన తెలిపారు.



పోస్టల్ బ్యాలెట్ వేస్తున్న ఉద్యోగి

ప్రధాన పార్టీల మధ్య పోటీ

ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో 56 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోసం 15మంది పోటీ పడుతున్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థుల మధ్యనే పోటీ ఎక్కువగా కొనసాగుతోంది. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ఆ పార్టీ నేతలు సర్వశక్తులు ఒడ్డారు. మొదటి సారిగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు పార్టీకి చెందిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, పూర్తిస్థాయిలో పనిచేశారు. వీరితో పాటు ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంత్‌రావు పూర్తిస్థాయిలో నిమగ్నమయ్యారు. అభ్యర్థి గెలుపు కోసం గ్రాడ్యుయేట్ల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేశారు. వీరితో పాటు పార్టీకి చెందిన కార్పొరేషన్ చైర్మన్లు మానాల మోహన్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, ఈరవత్రి అనిల్, గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, ముప్పగంగారెడ్డి, కేశవేణుతో పాటు ఇతర నేతలు పూర్తిస్థాయిలో నిమగ్నమయ్యారు. బీజేపీ అభ్యర్థి కోసం కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ప్రచారంలో పాల్గొన్నారు. వీరితో పాటు ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్‌రెడ్డితో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, మేడపాటి ప్రకాష్ రెడ్డి, మోహన్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డితో పాటు ఇతర నేతలు పూర్తిస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా ఆయా సంఘాల నేతలు పనిచేస్తున్నారు. ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్‌తో పాటు స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావుకు మద్దతుగా కొన్ని సంఘాల నేతలు పనిచేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ఆయా సంఘాల నేతలు పనిచేస్తున్నారు. బీజేపీ తరపున మొదటి సారిగా అభ్యర్థులు నిలబెట్టడంతో ఆయనకు మద్దతుగా పార్టీ నేతలు పనిచేస్తున్నారు. మొత్తంగా ప్రచారం ముగియడంతో చివరి ప్రయత్నాల్లో అభ్యర్థులు నిమగ్నమయ్యారు.

ప్రలోభపర్వం!

- ఎన్నికల ప్రచారం ముగియడంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థుల కసరత్తు
- ఓటుకు వెయ్యి నుంచి ఐదువేల వరకు ఖర్చు చేసేందుకు సిద్ధమైన అభ్యర్థులు

నిజామాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఘట్టం చివరి దశకు చేరుకోవడంతో అన్ని పార్టీల అభ్యర్థులు ప్రలోభ పర్వానికి తెరలేపారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగియడంతో గ్రాడ్యుయేట్‌తో పాటు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం అభ్యర్థులు ఓటర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. చివరి ప్రయత్నంగా భారీ మొత్తంలో ఖర్చు చేసేందుకు సిద్ధమవుతు న్నారు.

గ్రామాల వారీగా ఇన్‌చార్జీలు

గ్రామాల వారీగా ప్రతీ 25 మంది ఓటర్లకు ఒక అభ్యర్థిని ఇన్‌చార్జిగా నియమించి వారి ద్వారా మంతనాలు కొనసాగిస్తున్నారు. ఉపాధ్యాయ అభ్యర్థులు భారీ ఎత్తున ఖర్చు చేస్తున్నారు. ఒక్కొక్క సంఘం తరపున నిల్చున్న అభ్యర్థి ఓటుకు రూ.2వేల నుంచి రూ.5వేల వరకు ఖర్చు పెట్టేందుకు సిద్ధమయ్యారు. గ్రాడ్యుయేట్ అభ్యర్థులు వెయ్యి నుంచి రెండు వేల రూపాయల వరకు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు మొత్తం ఓటర్లలో 3లక్షల 55వేల 159 పట్టభద్రుల ఓట్లు ఉండగా 51 శాతం ఓట్లపైన ఖర్చు పెట్టేందుకు సిద్ధమయ్యారు. గతంలో పోలైన ఓటింగ్ శాతాన్ని పరిశీలిస్తూనే ఈసారి పెంచేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఖర్చుతో పాటు సిట్టింగ్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. విందులను కూడా ఆయా మండలాల పరిధిలో నిర్వహిస్తున్నారు. తమ సంఘాల ఓట్లు తమ అభ్యర్థికి పడే విధంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ప్రధాన సంఘం తరపున ఈ ఎన్నికల్లో ఐదు నుంచి ఆరు కోట్ల వరకు ఖర్చు పెట్టేందుకు అభ్యర్థులు సిద్ధమయ్యారు. ఉపాధ్యాయ ఓట్లు తక్కువగా ఉండటం వల్ల గ్రాడ్యుయేట్ అభ్యర్థులతో పోలిస్తే ఈ అభ్యర్థుల ఖర్చు తక్కువగానే ఉంది. గత ఎన్నికలతో పోలిస్తే మాత్రం ఉపాధ్యాయ ఎన్నికల ఖర్చు కూడా పెరిగింది.

నేడు రిపోర్టు చేయనున్న పోలింగ్ సిబ్బంది

నిజామాబాద్, ఆర్మూర్ ఆర్‌డీవో కార్యాలయాలతో పాటు బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో బుధవారం పోలింగ్ సిబ్బంది రిపోర్ట్ చేయనున్నారు. వారికి అక్కడ బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, పోలింగ్‌కు కావాల్సిన సామగ్రిని అందిస్తారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను కరీంనగర్‌కు చేర్చేందుకు ఏర్పాట్లు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులను కల్పించారు. అన్ని కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌ను ఏర్పాటు చేశారు. పోలింగ్ సరళిని ఈ వెబ్‌క్యాస్టింగ్ ద్వారా ఎన్నికల అధికారులు పరిశీలించనున్నారు. పోలింగ్ సందర్భంగా అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను విధించడంతో పాటు భారీగా పోలీస్ సిబ్బందిని బందోబస్తు కోసం ఏర్పాట్లు చేశారు.



నేడే మహా శివరాత్రి

- జిల్లా వ్యాప్తంగా ముస్తాబైన శివాలయాలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీలు
- ఉదయం నుంచే ప్రారంభం కానున్న అభిషేకాలు, అర్చనలు
- పూలు, పండ్లు, పూజ సామగ్రికి పెరిగిన గిరాకీ

5

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది

- నిరుద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై భరోసా లేకుండా చేసింది
- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

6

బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను బయటపెట్టిన సీఎం

- వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయని బీజేపీ ఎమ్మెల్యేలకు భయం పట్టుకుంది
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

6

సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

● రంజాన్ మాసం ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, హాజరైన అధికారులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తన ఛాంబర్‌లో మంగళవారం జిల్లా అధికారులతో సమావే శమై రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా చేపట్టవల్సిన ఏర్పాట్లు, కల్పించాల్సిన సౌకర్యాలపై సమీక్ష జరిపారు. ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు లేకుండా జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాలలో మౌళిక సదుపా యాలు అందుబాటులో ఉండేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని వీధిలైట్ల మరమ్మతులు, బోర్లు, పైప్‌లైన్‌ల మరమ్మతులు చేపట్టాల న్నారు. ప్రార్థన సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. మసీదులు, ఈద్గాల వద్ద పారిశుధ్య సమస్య లేకుండా చూడాలని ఎక్కడ కూడా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా సమస్యాత్మక ప్రాం తాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. వేసవి సీజన్ ప్రారంభమైనందున తాగునీటి సరఫరా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్, వసతి గృహాలకు రక్షిత మంచినీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, కిరణ్‌కుమార్, సబ్ కలెక్టర్ వికాస్ మహతో, అదనపు డీసీపీ బస్వారెడ్డి, జడ్పీ సీఈవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యతో పాటు సాంకేతికతను పెంపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు సాంకేతికతను పెంపొందించి స్కిల్‌డెవలప్ మెంట్‌పై అవగాహన కల్పించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. మంగళవారం నగరంలోని ఉమెన్స్ కళాశాలలో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు అనేక రకాల స్కిల్‌డెవలప్ మెంట్‌లో శిక్షణ అందించాలని, విద్యార్థులు సర్టిఫికెట్లకే పరిమితం కాకుండా సాంకేతికతతో నైపుణ్యతను సాధించి ఉద్యోగాలు పొందాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఐటీఐలను ఆధునీకరిస్తూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా కళాశాల చరిత్రను ఎమ్మెల్సీ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, కళాశాల పాలకవర్గ సభ్యులు పద్మనాభరెడ్డి, కిషన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ భారతి, తదితరులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి

కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం హెచ్చరించారు. అఖిల భారత విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో విద్యాసంవత్సరం పూర్తికాకముందే అడ్మిషన్ల పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రతీరోజు ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్న పరిస్థితి ఉందన్నారు. దీంతో 2025-26 సంవత్సరం అడ్మిషన్‌కు సంబంధించిన ఆఫర్ల పేరుతో వేల రూపాయలు దండుకుంటూ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని దీని ద్వారా పరీక్షల సమయంలో విద్యార్థులు ఇబ్బంది పడతారని ఆయన అన్నారు. అధికారులు వెంటనే స్పందించి ముందస్తుగా అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కాలేజీ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి, నాయకులు సుఖోద్, కుశాల్, రాజీవ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ శాతం పెరిగేనా?

- ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో శివరాత్రి జాగరణ ఆందోళన
- పోలింగ్ శాతం పెంచేందుకు అభ్యర్థుల ప్రయత్నాలు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ శాతంపై అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. శివరాత్రి పండుగ నేపథ్యంలో రాత్రంతా ఓటర్లు ఉపవాసంతోపాటు జాగరణ చేసే అవకాశాలు ఉండటంతో పోలింగ్ శాతం పెంపుపై ప్రభావితం చూపే అవకాశాలు ఉండవచ్చని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. శివరాత్రి మరుసటి రోజే ఎన్నికల పోలింగ్ జరగనుండటంతో పోలింగ్ శాతం నమోదుపై అభ్యర్థుల్లో భయం ఏర్పడింది. జాగరణ చేసి ఉపవాసం విడిచే రోజే పోలింగ్ ఉండటంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివస్తారో రారోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ ఎన్నికలతో పోలిస్తే పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ శాతం అంతంత మాత్రంగానే నమోదవుతుంది. జిల్లా యంత్రాంగం సైతం పోలింగ్ నిర్వాహణ, ఓటర్ల తరలింపుపై ఎక్కడ కూడా సరైన విధంగా ప్రచా రాన్ని నిర్వహించలేదు. పోటీలో ఉన్న అభ్యర్థులు మాత్రమే తమ ఎన్నికల ప్రచారంతో పాటు ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పోలింగ్ శాతం పెరిగితేనే విజయ అవకాశాలు పెరిగే అవకాశం ఉన్నందున అభ్యర్థులు పోలింగ్ శాతం పెంపుపై దృష్టి పెట్టారు. 15 జిల్లాలు, 42 నియోజకవర్గాలు, 271 మండలాల పరిధిలో ఈ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాల వారిగా ఓటర్లకు ఇప్పటికే ఓటరు స్లిప్‌లను పంపిణీ చేశారు. కానీ కొంత మంది ఓటర్లకు ఓటరు స్లిప్‌లు అందలేదు. భార్య భర్తలలో పట్టభద్రుల ఓటర్లకు ఒకరికి ఒక పోలింగ్ కేంద్రం, మరొకరికి మరొక చోట ఓటు రావడంతో వారంతా అయోమయానికి గురవుతున్నారు.

గతంలో తక్కువ పోలింగ్ శాతం..

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పరిధిలో జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 15 జిల్లాలు, 42 నియోజకవర్గాల పరిధిలో పట్టభద్రుల ఓటర్లు 3లక్షల 55వేల 159 మంది ఉండగా, ఉపాధ్యాయ ఓటర్లు 27వేల 88 మంది ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో పోటాపోటీ ఉండటంతో తక్కువ ఓట్లు పోలైతే తమకు నష్టం అనే ఆలోచనలో అభ్యర్థులు ఉన్నారు. 2019లో జరిగిన పట్టభద్రుల ఎన్నికల్లో మొత్తం ఓట్లు ఒక లక్షా 95వేల 581 ఓట్లు ఉండగా లక్షా 15వేల 359 ఓట్లు మాత్రమే పోల్ అయ్యా యి. పోలింగ్ శాతం 59.30 మాత్రమే నమోదైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం 23వేల 160 ఓట్లు ఉండగా 19వేల 349 ఓట్లు పోల్ కాగా 83.54 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికతో పోలిస్తే పట్టభద్రుల స్థానానికి ఓటర్లు అంతంత మాత్రంగానే ఓట్లు వేశారు. 60 శాతంలోపు పోలింగ్ నమోదు కాగా ఈసారి 80 శాతానికి పైగా పోలింగ్ నమోదైతేనే గెలుపుపై అభ్యర్థులు ఖచ్చితమైన అంచనాకు వచ్చే అవకాశం ఉంది. ఉపాధ్యాయ ఓటర్లు తక్కువ సంఖ్యలో ఉండటంతో వారు ఖచ్చితంగా ఓటు వేస్తారనే భావన అభ్యర్థుల్లో ఉంది. ఈసారి 90 శాతానికి పైగా ఓట్లు నమోదైతే గెలుపుపై ఖచ్చితమైన అంచనాకు వస్తామనే భావన ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఉంది. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారిని సాధారణ ఎన్నికల సందర్భంగా స్వగ్రామాలకు తీసుకువచ్చేవారు. ప్రస్తుత ఎన్నికల్లో ఓటర్లను కేంద్రాల వరకు తీసుకొస్తారో లేదోనన్న సందేహం అభ్యర్థుల్లో నెలకొంది. కొంత మంది ఓటర్లకు ఇంకా ఓటింగ్ విషయంలో ఎలాంటి సమాచారం లేకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు.

ఫటా..ఫట్...

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

● స్రవంతి ఎస్సై దోమకొండ



దోమకొండ మండలంలోనిఅన్నిగ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నామని, ఎవరైన శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని దోమకొండ ఎస్సైస్రవంతి ఆంధ్రజ్యోతితోమాట్లాడుతూ మరిన్ని వివరాలు వెల్లడించారిలా...

ఆంధ్రజ్యోతి: మీ పోలీసు స్టేషన్ పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి?

ఎస్సై:దోమకొండ పోలీసుస్టేషన్ పరిధిలో 9 గ్రామాలున్నాయి.

ఆంధ్రజ్యోతి:మండలంలోని యువతకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా?

ఎస్సై:యువతీ, యువకులకు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ బాలికలు, బాలుర పాఠశాలలు, కళాశాలలో వివిధ అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజలు ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా వివరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి:గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్నారా?

ఎస్సై: ప్రతి గ్రామంలోని ప్రజలకు సీసీ కెమెరాల పనితీరు పట్ల అవగాహన సమావేశాలను పెట్టి తెలియజేస్తున్నాం. పలువురి సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తాం.

ఆంధ్రజ్యోతి:డ్రంకెన్‌డ్రైవ్ నివారణ చర్యలేమిటి?

ఎస్సై: మద్యం తాగి వాహనాలు నడపరాదని యువకులకు అవగాహన కల్పిస్తున్నాం.ఓవర్‌స్పీడ్ వెళ్లరాదని సూచిస్తున్నాం.మద్యంతాగి వాహనాలు నడుపుతున్న వారినిజరిమానా కట్టిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ముత్యంపేట, దోమకొండ, అంబారీపేట, సంగమేశ్వర్ గ్రామాల్లో వారాంతపు సంతలు జరుగుతుంటాయి.సెల్‌ఫోన్‌లు, డబ్బులు దొంగతనం జరిగిన సంఘటనలు ఉన్నాయా?

ఎస్సై: దోమకొండలోనే ఎక్కువ జనసంచారంతో కూడిన వారాంతపు సంత జరుగుతుంది. ప్రతి సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 8 వరకు జరిగే సంతలో బైక్‌పై పోలీసు కానిస్టేబుళ్లు ఇద్దరు, పెట్రో కారులో ఏఎస్సైతో పాటు ముగ్గురు పీసీలు, మరో ఇద్దరు కానిస్టేబుళ్లను మఫ్టీలో ఉంచుతూ విధులు నిర్వహించడం జరుగుతుంది. మిగాతా గ్రామాల్లో ఉదయం పూట సంత జరుగడంతో ఎలాంటి దొంగతనాలు జరిగే అస్కారం లేదు.

ఆంధ్రజ్యోతి:మండల పరిధిలో ఆకాతాయిలు బైక్‌లపై త్రీబుల్ రైడింగ్‌తో పాటు ఓవర్ స్పీడ్ వెళ్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.పోలీసులు నుంచి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై:ఎవరైన ఓవర్‌స్పీడ్ వెళ్లిన,పోలీసుల నిబంధనలు పాటించకపోయినటువంటి వాహనాలను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. నిబంధనలు పాటించకుంటే ఎంతటి వారినైన ఉపేక్షించే ప్రసక్తేలేదు.

ఆంధ్రజ్యోతి:శివరాత్రి పండగ సందర్భంగా దోమకొండలో రాత్రి రథాలు బస్టాండ్‌కు వస్తాయి. గడికోటలో సంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ప్రజలు, భక్తులు ఉపవాసాలతో శివరాంమందిర్ ఆలయానికి మొక్కులు చెల్లించుకునేందుకు పెద్ద ఎత్తున వస్తుంటారు. మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై:శివరాత్రి పండగ సందర్భంగా సీఐ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో దోమకొండలో భారీబందోబస్తు నిర్వహిస్తాం.ముఖ్యంగా మహిళలు ధైర్యంగా ఆలయాలకువెళ్లి మొక్కులు తీర్చుకోవచ్చు. మఫ్టీలో కుడా మహిళాపోలీసులు బందోబస్తు నిర్వహిస్తారు.ఎవరైన ఇతరులకు ఇబ్బందులు కలిగేలా,అసభ్యంగా ప్రవర్తిస్తేవారిపై కేసులు నమోదు చేస్తాం. ఎవరైన మహిళలను ఇబ్బందులు పెడితే వెంటనే 100కి లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

● (ఆంధ్రజ్యోతి, దోమకొండ)

తడిపొడి చెత్తపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆర్మూర్‌టౌన్,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి)మున్సిపల్ పరిధిలోని 19 వార్డులో మహిళలకు తడిపొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టార్ గజానంద్ తడిపొడి చెత్తతో పాటు హానీకరమైన చెత్త గురించి మహిళలకు అవగాహన కల్పించి మున్సిపల్ ట్రాక్టర్‌కు అందజేయాలని తెలిపా రు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పర్యవరణ ఇంజనీర్ పూర్ణమౌళి, వార్డు ఆఫీసర్ మహేష్‌బాబు, ప్రజ్ఞ,మెప్మా ఆర్‌పీ, తదిత రులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్సీ కవిత రూ.50వేల విరాళం

రెంజల్,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయంలో జరిగే శివపార్వతుల కల్యాణం కోసం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత 50వేల రూపాయల నగదును బీఆర్‌ఎస్ యువజన నాయకుడు పిల్లల ప్రవీణ్, గ్రామ పెద్దలకు అందజేశారు. అడిగిన వెంటనే కాదనకుండా శివపార్వతుల కల్యాణం కోసం రూ.50వేల నగదును అందజేసిన ఎమ్మెల్సీ కవితకు గ్రామస్థులు రుణపడి ఉంటారని ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పిల్లల సాయిలు, విలాస్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్‌లో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌వో, తహసీల్దార్

ఆర్మూర్‌రూరల్,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఉన్నత పాఠశాలలో ఈనెల 27న జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆర్మూర్‌ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్, తహసీల్దార్ సత్యనారాయణలు పరిశీలించారు.ఎలాంటి పొరపాట్లకు తావి వ్వ కుండా పకడ్బందీగా ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలని అధి కారులకు సూచించారు.ఈకార్యక్రమంలో హెచ్‌ఎం, టీచర్లు పాల్గొన్నారు.

గోవూర్ రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మోస్రా,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి):మోస్రా మండలంలోని గోవూర్ గ్రామ శివారులో సోమవారం రాత్రిజరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ మండలంలోని భవానీపేట గ్రామానికి చెందిన మాగిరి లింగారాం(57)అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై చేపలు అమ్ముటకు మోస్రా వైపు వెళ్లి చేపలు అమ్ముకుని తిరిగి తన స్వగ్రామం భవానీపేట వైపు వస్తుండగా గోవూర్‌శివారులో ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.మృతుడి కుమారుడు భూమేష్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోధన్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.డీసీఎం డ్రైవర్ అతివేగంతో ఈ ప్రమాదంజరిగినట్లు తెలిపారు.మృతుడికి కుమారుడు,ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తరపున ప్రచారం



పట్టభద్రులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఆల్ఫో ర్స్ నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరుతూ మంగళవారం మండ లంలోని కాంగ్రెస్ నాయకులు మాజీ జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్ ఓటరు పట్ట భద్రులను కలిసి తమమొదటి ప్రాధాన్యత వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేండ్ల రమేష్, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, మునీర్, రొక్కెడ సంజీవ్, అన్వర్, జుంగల రాజాగంగారాంలు పాల్గొన్నారు.

రెంజల్: ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వుట్కూరు నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి అన్నారు. మంగళవారం రెంజల్ మండల కేంద్రంలో పట్టభద్రుల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులందరు ఆలోచించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన నరేందర్ రెడ్డిని గెలిపించాలని, నిరుద్యోగుల సమస్యల కోసం కృషి చేసే నాయకుడు నరేందర్ రెడ్డిని గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాయిబాబా గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుర్మె శ్రీను, లోక కృష్ణ, సాయాగౌడ్, ప్రభాకర్, ఆసాని అనిల్, సల్మాన్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్:రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు అండగా ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పీసీసీ అధికార ప్రతినిధి ఏబీ.శ్రీనివాస్ (చిన్నా) అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14నెలల పాలనలో నిరుద్యోగ యువకులకు ఎన్నో ఉద్యోగాలు కల్పిం చడంతో పాటు మతిభ్రమిం చిన బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై మాట్లాడుతున్నారని, నిరుద్యోగ యువత కాంగ్రెస్ పాలనలో ఆదరిస్తుండడంతో బీజేపీ నాయకులకు భ యం పట్టుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోల వెంకటేష్, బట్టు శంకర్, బోడమీది బాలకిషన్, ఎస్‌కె.బబ్లు, మీసాలరవి, పాషా, పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

నవీపేట,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరిగే మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలలో పోటీ చేస్తున్న అంజిరెడ్డికి మద్దతుగా మంగళవారం మండల భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని వారు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లి శ్రీకాంత్, రాజేందర్ గౌడ్, రాము, బునాది ప్రవీణ్, అరవింద్ రెడ్డి తదితరులున్నారు.

రెంజల్: పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు మేక సంతోష్ అన్నారు. మంగళవారం మండలంలోని బోర్గాం, సాటాపూర్, తాడ్‌బిలోలి గ్రామాలలో పట్టభద్రుల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులందరు బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీనాయకులు రాజేందర్, నరేష్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: గ్రాడ్యుయేట్, పట్టభద్రులు, ఉపాధ్యాయ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి కోరారు. మంగళవారం మండలంలోని బ్రహ్మణ్‌పల్లి, తొర్లికొండ గ్రామాల్లో పట్టాభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లను కలిసి ప్రచారం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పద్మరెడ్డి, జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు వంశీగౌడ్, మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజేంధర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఈర్ల భూమేష్, తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మణ్‌పల్లి, తొర్లికొండలో ప్రచారం చేస్తున్న దృశ్యం

తొండాకూర్ సబ్‌స్టేషన్‌లో బ్రేకర్‌ను ప్రారంభించిన డీఈ



తొండాకూర్ సబ్‌స్టేషన్‌లో బ్రేకర్‌ను ప్రారంభించిన డీఈ శ్రీనివాస్

డొంకేశ్వర్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి):డొంకేశ్వర్ మండలంలోని తొండా కూర్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం కొత్తగా బ్రేకర్‌ను ఏర్పాటు చేశారు.ఈ బ్రేకర్‌ను డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ పాల్గొని ప్రారంభించారు. అంతకు ముందు సబ్‌స్టేషన్ పరిధిలోని రైతులతో కలిసి పొలంబాట కార్యక్రమం నిర్వ హించారు. రైతుల సమస్యలను డీఈ అడిగితెలుసుకున్నారు. వాటి పరిష్కార మార్గాలను రైతులకు వివరించారు.ప్రత్యేకంగా తొండాకూర్‌కు బ్రేకర్‌ను ఏర్పా టు చేయడంతో రైతులు విద్యుత్ శాఖ అధికారులను సన్మానించి ధన్యవా దాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ అశోక్, ఏఈ రమేష్, మాజీసర్పంచ్ దేవన్న, మాజీ ఉపసర్పంచ్ రాజేందర్, రైతులు సా యన్న, ప్రశాంత్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ గ్రామంలో 33/11 కెవి ఉప విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాపై ట్రాన్స్‌కో అధికారులు అవగాహన కల్పించారు. ఈ వేసవికాలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగ కుండా ఉండేందుకు కొత్తగా వీసీడీ బ్రేకర్ ఏర్పాటు చేశామని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈ రవీందర్, ట్రాన్స్‌కో అధికారులు రమేష్, ఉత్తమ్‌దేవి, ప్రవీన్‌కుమార్, లైన్‌మెన్‌లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలి

● విద్యార్థులు ఒత్తిడితో చదవొద్దు

బోధన్‌రూరల్,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలని కోర్టు న్యాయాధికారి శేషతల్ప సాయి అన్నారు. మంగళవారం బోధన్‌లోని విజయసాయి ప్రాథమిక పాఠశాల 25వ వార్షికోత్సవ మహోత్సవానికి కోర్టు న్యాయాధికారి శేషతల్ప సాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే భయపడవద్దని కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని అప్పుడే అనుకున్న విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, పట్టణ సీఐ వెంకట రమణ, విజయసాయి పాఠశాల కల్పన, మేనేజర్ రాజశేఖర్, చక్రవర్తి, సువర్చన, ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

దాబాపై నుంచి పడి ఒకరి మృతి

ఆర్మూర్‌రూరల్ , ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): నందిపేట మండల కేంద్రంలో సోమవారం రాత్రి మద్యం మత్తులో దాబపై నుంచి పడి గొల్ల చిన్న ముత్యం(25) మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నందిపేట మండల కేంద్రంలోని రాజ్‌నగర్ ప్రాంతానికి చెందిన గొల్ల చిన్న ముత్యం కూలీ పని చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి రాజ్‌నగర్ దుబ్బా ప్రాంతంలో కల్లు డిపోలో మద్యం తాగిన తర్వాత తిరిగి మద్యం సీసా కొనుగోలు చేసి ఒక దాబపైకి వెళ్ళగా ప్రమాదవశాత్తు మెట్లపై జారీ పడి కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుని సోదరుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రెంజల్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి):మండలంలోని కందకుర్తి అంత:రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరికి గాయలు అయినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సాటాపూర్ గ్రామానికి చెందిన మద్నూర్ గంగారాం, హనుమంతు ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై ధర్మాబాద్ వెళ్లి డోలు వాయిద్యం రిపేరు చేయించుకుని తిరిగి వస్తుండగా కందకుర్తి అంత:రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మద్నూర్ గంగారాం అక్కడికక్కడే మృతి చెందగా హనుమంతుకు గాయాలు అవ్వడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన గంగారాంను పోస్టు మార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోధన్‌రూరల్,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): మంజీర సరిహద్దు గ్రామాల నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామని బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేయడంతో ట్రాక్టర్లపై కేసు నమోదు చేశామన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు నియమ, నిబంధనలతో కూడిన వారే ఇసుక రవాణా చేయాలన్నారు. ఉదయం వేళల్లో మాత్రమే ఇసుక రవాణా చేయాలన్నారు. అనుమతి పత్రాలు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవీపేట,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ శివారులో మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని గ్రామస్థులు తెలిపారు. మృతుడు 35 నుంచి 40సంవత్సరాల మధ్యన ఉంటాడని, అతని ఒంటిపై డ్రాయర్ తప్ప ఇతర దుస్తులు లేవని అన్నారు. అతడికి కొంతకాలంగా మానసిక స్థితి బాగా లేదని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీసులకు గ్రామస్థులు వివరించారు.

నలుగురి నిందితులకు జైలు

మోస్రా, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి):2018 సంవత్సరంలో మోస్రా గ్రామానికి చెందిన వృద్ధురాలితోపాటు ఆమె కుమారునితో గొడవపడి కొట్టిన విషయంలో నిందితులపై కేసు నమోదుచేసి, ఛార్జీషీటు వేయడం జరిగినది. ఇట్టి కేసులో మంగళవారం బోధన్ అడిషినల్ న్యాయాధికారి సాయి శివ నలుగురు నిందితులకు పది నెలల జైలు శిక్షతో పాటు ఆరువేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించినట్లు వర్ని ఎస్సై రమేష్ తెలిపారు. ఇట్టి కేసులో బాధితుల తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిఎచ్. రాణి వాదనలు వినిపించారం.

భక్తుల కోరికలు తీర్చే కలిగోట పుట్ట శివాలయం

● మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన శివాలయాలు

జక్రాన్‌పల్లి,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి):మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని మండలంలోని కలిగోట్ గ్రామంలో పుట్ట శివాలయం ఉత్సవాలకు ముస్తాబు చేశారు. కలిగోట్ గ్రామంలో వాగుఒడ్డు పక్కన పుట్ట శివాలయం వెలిసింది.అప్పటి నుంచి ఈ పుట్ట శివాలయానికి భక్తులు భారీగా తరలి వచ్చి మొక్కులు తీర్చుకుం టారు. కోరిన కోర్కెలు తీరుతున్నాయని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ ఏడాది మహాశివరాత్రి సందర్భంగా పుట్ట శివాలయానికి జక్రాన్‌పల్లి మండల ప్రజలే కాకుండా జిల్లాలోని ఇతర మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకుం టారు. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా ఈ పుట్ట శివాలయాన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకోవడానికి సుమారు 25నుంచి 30వేల మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకోనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకోనున్న సందర్భంగా పుట్ట శివాలయం వద్ద ఎస్సై సీహెచ్.తిరుపతి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

కమ్మర్‌పల్లి: బాల్కొండ నియోజికవర్గం రాజాన్న సిరిసిల్లా జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో కొలువుదీరిన శ్రీభవాని శంబులింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయి.శివమాళధారల చేసిన భక్తులు ఆలయంనుండి గ్రామ ప్రధన వీదుల్లో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెర్కిట్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఆర్మూర్ పట్టణంలోని సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం శివరాత్రికి ఒక రోజు ముందు శివపార్వతుల కల్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, కోడిగెల మల్లయ్య, పొద్దుటూరిచరణ్‌రెడ్డి, బోండ్లఆనంద్,అజారిసతీష్,శంకర్, అలిశెట్టినరేష్, ప్రశాంత్‌గౌడ్, సిద్దులగుట్ట సేవసమితి సభ్యులు పాల్గొన్నారు.

క్షత్రియ పాలిటెక్నిక్ కళాశాలలో వీడ్కోల సమావేశం

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): పెర్కిట్‌లోని తిరుమల గార్డెన్‌లో మంగళవారం క్షత్రీయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ కళాశాలలో నేర్చుకున్న నైపుణ్యాలు, మేళకువలతో ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్‌కె.పాండే, వైస్‌ప్రిన్సిపాల్ నరేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ పార్టీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడి యేట్ సీనియర్ విద్యార్థులకు జూనియర్ విద్యా ర్థులు వీడ్కోలు పలికారు. అనంతరం విద్యార్థినిలు నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, లెక్చరర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒత్తిడి అధిగమిస్తేనే విజయం

ధర్పల్లి, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి) ఒత్తిడిని అధిగమిస్తామని విజయం సాధిస్తా_రని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షిక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మహేష్, ప్రసన్నజ్యోతి, హరిత, జయలక్ష్మీ, అరుణ్, సురేష్‌బాబు, అరుణ్‌కుమార్, చిన్న బాలయ్య, విఠల్, ప్రవీన్‌కుమార్, పాల్గొన్నారు.

డిపో అభివృద్ధికి పాటుపడాలి

బోధన్‌రూరల్,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు ఆర్టీసీ సిబ్బంది మెరుగైన సేవలు కల్పించి డిపో అభివృద్ధికి, సంస్థ అభివృద్ధికి పాటుపడాలని ఆర్టీసీ నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికులకు సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్పించే బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. ఆర్టీసి సిబ్బంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడంతో పాటు సంస్థ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రభుత్వం మహిళ ప్రయాణికులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని, వారికి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో తోడ్పటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ డిపో మేనేజర్ శ్రీనివాస్, ఏఈ శ్రావణ్, ఎస్‌టీఐ లక్ష్మణ్, ఆర్టీసీ సిబ్బందిపాల్గొన్నారు.

ముప్కాల్‌లో బర్త్‌డే ఫ్లెక్సీల వివాదం



గ్రామపంచాయతీ సిబ్బందిపై మండిపడుతున్న అభిమానులు

ముప్కాల్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి) ముప్కాల్ మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు జన్మదినం పురస్కరిం చుకొని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మంగళవారం గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించడంతో వివాదం చెలరేగింది. పార్టీ గుర్తులు లేకుండా అభిమానులు ఏర్పాటు చేసుకున్న జన్మదినం ఫ్లెక్సీలను తొలగించడంతో పలువురు అభి మానులు సిబ్బందిపై మండిపడ్డారు. గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లగా బహిరంగ ప్రదేశాల్లో ఏటువంటి ఫ్లెక్సీలు పెట్టరాదని తెలపడంతో వివాదం సద్దు మనిగింది.

ధర్మారంలో వివాహిత ఆత్మహత్య

నవీపేట,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారంకు చెందిన బోదాసు కీర్తి(30)అనే వివాహిత మహిళ సోమవారం సాయంత్రం గుర్తు తెలియని పురుగుల మందును సేవించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందిందని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. మెదక్ జిల్లా చేగుంటకు చెందిన కీర్తిని 8సంవత్సరాల క్రితం ధర్మారంకు చెందిన వినోద్ కుమార్‌కు ఇచ్చి వివాహం జరిపించారని అన్నారు. పెళ్లి సమయంలో ఐదు తులాల బంగారం, రెండు లక్షల రూపాయల నగదుతో పాటు ఇతర సామాగ్రిని కట్నం కింద ఇచ్చారు. వీరికి ఏడు సంవత్సరాలు, నాలుగు సంవత్సరాల వయసు గల ఇద్దరు కుమారులు ఉన్నారు. గత మూడు సంవత్సరాలుగా వినోద్ కుమార్ భార్య కీర్తిని లక్ష రూపాయల అదనపు కట్నం తేవాలని కోరుతూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఈ విషయంపై పలుమార్లు పెద్దలు నచ్చజెప్పినప్పటికీ వినోద్ కుమార్ తన పద్దతి మార్చుకోలేదు. ఇటీవల వినోద్ కుమార్ మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. తన భర్త వేధింపులు భరించలేక ఈ నెల 24న సాయంత్రం కీర్తి గుర్తు తెలియని పురుగుల మందును సేవించింది. వెంటనే ఆమెను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి సూర ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా మృతురాలి కీర్తి అంత్యక్రియలను మంగళవారం సాయంత్రం ధర్మారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ముందు జాగ్రత్తగా పెద్ద ఎత్తున పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. నవీపేట ఎస్‌ఐ వినయ్, మాక్లూర్ ఎస్‌ఐ రాజశేఖర్‌లు బందోబస్తును పర్యవేక్షించారు.

బేస్‌బాల్ పోటీలకు తొర్లికొండ విద్యార్థుల ఎంపిక

జక్రాన్‌పల్లి ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బేస్ బాల్ పోటీలకు మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు గంగామోహన్ తెలిపారు. జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్మూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో, సుద్దపల్లి క్రీడా మైదానంలో ఈనెల 21న జరిగిన జిల్లా బేస్‌బాల్ జట్టు ఎంపిక పోటీల్లో విద్యార్థులు చక్కని ప్రతిభ కనబర్చగా రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో కేజీ టు పీజీ గ్రౌండ్‌లో ఈనెల 28నుంచి మార్చి 2వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవో అభినందించారు. సుద్దపల్లిలో ఈనెల 22నుంచి 25వ తేదీ వరకు శిక్షణ పొందారన్నారు. బాలికల విభాగంలో ఆర్.గంగోత్రి, బి.మైతి, డి.వనజ, టి.సవిత, బాలుర విభాగంలో డి.మురళీ, బి.విష్ణుచైతన్య, సీహెచ్.సుశాంత్, ఎం.శివలు ఎంపికైనట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయుడు గంగామోహన్, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

మగ్గిడి రోడ్డు పనులు ప్రారంభం



మగ్గిడిలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. మగ్గిడి గ్రామం నుంచి అమ్దాపూర్ మీదుగా నందిపేట మండలం వన్నెల(కె) సిద్దాపూర్ గ్రామాల వరకు రోడ్డు పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.9కోట్ల 47లక్షలు మంజూరు చేసింది. మగ్గిడి నుంచి వన్నెల్ మీదుగా నందిపేట మండలానికి రోడ్డు పనులు ప్రారంభం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులను ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పిప్రి జీవన్‌రెడ్డి, నాగరాజు, అశోక్, దేవరాజు, రాకేష్‌రెడ్డి, సిద్దపూర్ గంగాధర్, అమ్దాపూర్ రాజులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ వదంతులను నమ్మొద్దు



చికెన్ వంటకాలను అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ వదంతులను నమ్మొవొద్దని వెన్‌కాబ్ చికెన్ ప్రతినిధులు ప్రవీణ్, మల్లేష్, వరప్రసాద్, రాజు, బోధన్ ఏవన్ పౌల్ట్రీ ట్రేడర్ యాజమాని ఇలియాజ్ సేట్ పేర్కొన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో గల చికెన్ సెంటర్ల సముదాయంలో చికెన్‌ఫ్రై, చికెన్ వంటకాలతలో పాటు కోడిగుడ్లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరైన చికెన్ తినడానికి ఆసక్తి కనబర్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బర్డ్‌ఫ్లూపై ప్రజలు ఎలాంటి అపోహలకు గురి కావద్దని అవగాహన కల్పించారు. చికెన్ వ్యాపారులు, చికెన్ వినియోగదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బర్డ్‌ఫ్లూపై వస్తున్న వదంతులను ప్రజలు నమ్మొవొద్దన్నారు. 100డిగ్రీల సెల్సియస్‌పై చికెన్ వండితే ఎలాంటి వైరస్ అయిన చనిపోతుందని పేర్కొన్నారు. ప్రజలు గతంలో లాగానే చికెన్ కొనుగోలు చేయాలని కోరారు.

పీహెచ్‌సీలో టీబీ వ్యాక్సినేషన్ ప్రారంభం



వేల్పూర్‌లో టీబీ వ్యాక్సినేషన్ ప్రారంభిస్తున్న జిల్లా టీబీ నియంత్రణ అధికారి

వేల్పూర్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి):వేల్పూర్‌మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ దేవి నాగేశ్వరి టీబీకి సంబంధించిన ఇంజక్షన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీపై టీబీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ ఆరోగ్య కేంద్రంలో సై టీబీ పరీక్ష అనేది మానవ శరీరంలో టీబీ ఇంజక్షన్ ఉందో లేదో తెలుసుకోవడానికి ఉపయోగపడే ముందస్తు పరీక్ష అన్నారు.డయాబెటిక్, కాంట్రాక్టు దీర్ఘకాలిక వ్యాధు లతో బాధపడుతున్న వారు ఈ పరీక్షలు చేయించుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్, డాక్టర్ వీణ, డాక్టర్ శరత్‌చంద్ర, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవిగౌడ్, సీహెచ్‌వో నారాయణ, వేణు, తదితరులు ఉన్నారు.

108లో ప్రసవం తల్లీబిడ్డ క్షేమం

కోటగిరి, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన పద్మశిల కు పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు సమాచారం అందించారు. ఆ మహిళను 108లో కోటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వారు బోధన్ ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. దీంతో ఆ మహిళను అంబులెన్స్‌లో బోధన్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే అంబులెన్స్‌లో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని మెరుగైన వైద్యం కోసం బోధన్ ప్రభుత్వ దవాఖానాలో చేర్పించినట్లు 108 సిబ్బంది తెలిపారు. ఈఎంటీ నాగరాణి, పైలెట్ కరణ్ కృష్ణా తదితరులు ఉన్నారు.



● విద్యుత్‌కాంతుల మధ్య కంఠేశ్వర్ ఆలయం

ముస్తాబైన శివాలయాలు



కొనుగోదారులతో సందడిగా నిజామాబాద్ కూరగాయల మార్కెట్



పండ్లు కొనుగోలు చేస్తూ..

- పుణ్యప్రదం మహాశివరాత్రి పర్వదినం
- శివాలయాల్లో ఉదయం నుంచే ప్రారంభం కానున్న అభిషేకాలు, అర్చనలు
- ఉపవాస దీక్షలతో శివ ఆరాధన
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన దేవాదాయ శాఖ
- పండ్లు, పూలకు పెరిగిన డిమాండ్



పూల దుకాణాల వద్ద..

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శివరాత్రి పర్వదినానికి ప్రసిద్ధ దేవాలయాలతో పాటు శివాలయాలు ముస్తాబయ్యాయి. శివాలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు ఉదయం నుంచే ఆలయానికి వచ్చే అవకాశం ఉండటంతో అందుకు అనుగుణంగా హైమాక్స్ లైట్లు, టెంట్లు, పందిళ్లు, భారీ కేడ్‌లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. భక్తులు అధికంగా వచ్చే ఆలయాల్లో వాలంటీర్లు, పోలీసుల సహకారంతో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దర్శించుకునే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వర ఆలయం, శంభులింగేశ్వర ఆలయం, అమరేశ్వర ఆలయం, నందిగుట్ట శివాలయం, శ్రద్ధానంద్‌గంజ్‌లోని ఉమా మహేశ్వర ఆలయం, ప్రగతినగర్‌లోని మనోకామేశ్వర ఆలయం, మల్లారంలోని శివాలయం, బోధన్ ఏకచక్రేశ్వర ఆలయం, నందిపేట్ మండలంలోని ఉమ్మెడ గ్రామంలోని ఉమామహేశ్వర ఆలయం, కేదారేశ్వర ఆలయం, కందకుర్తి శివాలయం, అంక్సాపూర్‌లోని పాదరస శివాలయం, పోచంపాడ్ శివాలయం శివరాత్రి పండుగకు ముస్తాబబయ్యాయి.

పుణ్యప్రదం మహాశివరాత్రి పర్వదినం

శివునికి ప్రీతికరమైన మహాశివరాత్రి పర్వదినం పుణ్యప్రదమైనది. ప్రతియేటా మాఘ మాస బహుళ చతుర్ధశి రోజున శివుడి జన్మించిన రోజున మహాశివరాత్రి పర్వదినాన్ని జరుపుకుంటారు. హిందూ సాంప్రదాయంలో శివుడు భౌతిక విషయాలను అందించే దేవుడిగా ఆరాధిస్తే విష్ణువుని మోక్ష ప్రధాతగా భక్తులు భావిస్తారు. శివుడిని పూజించిన వారికి సకల శుభాలతో పాటు కోరిన కోరికలు నెరవేరుతాయని శివపురాణం చెబుతుంది. ప్రతీరోజు శివ ఆరాధన చేసిన భక్తులకు భోలాశంకరుడి అనుగ్రహం లభిస్తుందని భౌతిక కోరికలు నెరవేరుతాయని భక్తులు విశ్వసిస్తారు. ప్రతీరోజు శివారాధన చేయలేని వారు మాసశివరాత్రి రోజైన లేదా ఏడాదికి ఒకసారి వచ్చే మహాశివరాత్రి పర్వదినంరోజైన చేయడంతో శివుడి అనుగ్రహం లభిస్తుందని భావిస్తారు. మహాశివరాత్రి పండుగలో ఉపవాసం, శివునిపై ధ్యానం, ఆత్మపరిశీలన, సామాజిక సామరస్యాన్ని ప్రోత్సహించే వేదికగా నిలుస్తోంది. శివాలయాల్లో ఈ పర్వదినాన పగటిపూట ఉపవాసదీక్ష పాటిస్తూ రాత్రిపూట భజనలు, భక్తిపాటలతో జాగరణ చేయడం ప్రత్యేకతగా భావిస్తారు. శివుడు జన్మించిన లింగోద్భవ కాలంలో శివునికి పంచామృత అభిషేకాలతోపాటు వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహిస్తే సంవత్సరం పొడవున వచ్చే వ్యాధులు, బాధలు తొలగిపోతాయని శాస్త్రం చెబుతోంది. భక్తులు శివరాత్రి పర్వదినాన్న శివ స్తోత్రాలను జపిస్తూ శివుడికి ప్రీతికరమైన శివతాండవం చేయడం అత్యంత శ్రేష్టంగా భావిస్తారు. శివరాత్రి పర్వదినాన్న పలు ఆలయాల్లో లింగోద్భవ పూజ ముగిసిన తర్వాత శివ పార్వతుల కల్యాణాన్ని నిర్వహించడం సాంప్రదాయంగా వస్తోంది.



ఉపవాస దీక్షతో అభిషేకం, అర్చన

భక్తులు శివరాత్రి పర్వదినాన్న శివుడిని ఉపవాస దీక్షతో అభిషేకించడం, అర్చించడం ప్రత్యేకంగా భావిస్తారు. లింగానికి పంచామృత అభిషేకాలు నిర్వహించి శివనామాలతో ఏకబిల్వ పత్రాలు, గోగుపూవుతో పూజిస్తారు. పార్వతీదేవి శివుడిని తన భర్తగా పొందడానికి చేసిన కఠినమైన తపస్సు చేసినట్లుగా భక్తులు కఠిన ఉపవాస దీక్షతో పూజించిన వారికి శివఅనుగ్రహం లభిస్తుందని మార్కండేయ పురాణం చెబుతోంది. శివరాత్రి పర్వదినాన్న ఉపవాస దీక్షకు ఎంతప్రాముఖ్యత ఇస్తారో జాగరణకు అంతటి ప్రాధాన్యత ఇచ్చి సంపూర్ణమైన భక్తితో అర్చిస్తారు.

పండ్లు, పూలకు పెరిగిన డిమాండ్

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివుడికి అందించే పూలు, పండ్లకు డిమాండ్ పెరిగింది. శివుడికి ప్రీతికరమైన గోగుపూవు, ఏకబిల్వ పత్రాలకు డిమాండ్ పెరగడంతో వివిధ గ్రామాల నుంచి తీసుకొచ్చి అమ్ముతున్నారు. పూలతో పాటు రత్నపూరిగడ్డ, అంగూరు, తర్భూజా, అరటిపండ్లు, పేండ్ కజూర్, తదితర పండ్లకు డిమాండ్ పెరగడంతో వ్యాపారులు ఇదే అదనుగా చూసుకొని అధిక ధరలను పెట్టి విక్రయిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు తక్కువ ధరకే అమ్మిన వ్యాపారులు పండుగ సందర్భంగా అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పెద్దబజార్, మల్టీప్లెక్స్, పూలాంగ్ రోడ్, గోల్‌హనుమాన్, వీక్లీమార్కెట్, హనుమాన్ జంక్షన్, నీలకంఠేశ్వర్ బైపాస్‌రోడ్, పాలిటెక్నిక్ కళాశాల మైదానం రోడ్డు, గంజ్, బోధన్‌రోడ్, తదితర ప్రాంతాల్లో పూల, పండ్ల వ్యాపారాలతో సందడిగా మారాయి.

ప్రత్యేక ఏర్పాట్లు చేసిన దేవాదాయ శాఖ

ఉమ్మడి జిల్లా పరిధిలోని దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని శివాలయాల్లో దేవాదాయ శాఖ విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. గత వారం రోజులుగా ఉమ్మడి జిల్లా పరిధిలోని దేవాదాయ అధికారులతో ఇంచార్జి సహాయ కమీషనర్ రవీంధర్‌గుప్త పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ ఆదేశానుసారంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శివరాత్రి పర్వదినానికి రెండు రోజుల ముందే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించడంతో అన్ని దేవాలయాల్లో శివరాత్రి ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. శివరాత్రి పర్వదినాన భక్తులు ఉపవాస దీక్షను చేపట్టనుండటంతో భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పండ్లు అందించే విధంగా ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేస్తున్న ఆలయ సిబ్బంది



శంబుని గుడిలో విద్యుత్ వెలుగులు



కంఠేశ్వర్ ఆలయంలో క్యూ కోసం ఏర్పాటు చేస్తున్న కర్రలు



నాళేశ్వర్ రాజరాజేశ్వర ఆలయ లోపలి భాగం



విద్యుత్‌దీపాలతో అలంకరించిన ఆలయం

ముస్తాబైన నాళేశ్వర్ రాజరాజేశ్వర ఆలయం

● తమ్ముడు వేములవాడలో అన్న నాళేశ్వర్‌లో కొలువుదీరారని భక్తులు విశ్వాసం

నవీపేట, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలకు మండలంలోని నాళేశ్వర్‌లోని చారిత్రక రాజరాజేశ్వర ఆలయం ముస్తాబైంది. నాళేశ్వర్ గోదావరి తీరన వందల ఏళ్ల పూర్వం ఈ ఆలయం స్వయంభు లింగంగా వెలిసిందని పూర్వీకుల విశ్వాసం. రాతి స్తంభాలతో నిర్మించిన ఈపురాతన ఆలయం ఇప్పటికి చెక్కు చెదరకుండా ఉండడం విశేషం. వేములవాడలో కొలువైన రాజరాజేశ్వర స్వామిని తమ్ముడిగా, నాళేశ్వర్‌లో కొలువైన రాజరాజేశ్వర స్వామిని అన్నగా భక్తులు కొలుస్తుంటారు. శివరాత్రి రోజున స్థానిక రాజరాజేశ్వర ఆలయంలో కోడె దూడలను ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించి ఆలయం ఎదురుగా ఉన్న రాతి స్తంభానికి కోడెదూడలను కట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఇటువంటి ఆచారం మన రాష్ట్రంలో ఒక్క వేములవాడలో ఈ పద్ధతిలో ఉంది. శివరాత్రి ఉత్సవాలకు జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తుంటారు.

ముప్కాల్, కొత్తపల్లిలో ముస్తాబైన శైవక్షేత్రాలు

ముప్కాల్, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి, ముప్కాల్ గ్రామాల్లో శైవ క్షేత్రాలు శివరాత్రి ఉత్సవాలకు సర్వాంగ సుంద రంగా దేవదాయ కమిటీలు తీర్చిదిద్దారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పడిలేచిన మర్రిచెట్టు వద్ద కొత్తపల్లి రాజరాజేశ్వర దేవస్థానంలో ఆలయాన్ని రంగులు వేసి విద్యుత్ దీపాలను, చలువ పందిళ్లతో అలంకరించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా 25న మంగళవారం స్థాపిత దేవత పూజ, హోమం, నేడు శివరాత్రి పర్వదినం రుద్రాభిషేకం, బిల్వార్చన, 12గంటలకు శివపార్వతుల కల్యాణం, శివరాత్రి జాగరణ, భజన కార్యక్రమాలు జరుగుతాయని, రాత్రి లింగో ద్భవ కాలంలో బిల్వషేకం చే యనున్నట్టు అర్చకులు తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యర్థం చలువ పందిరి, మంచినీటి వసతులు, పార్కింగ్ వ్యవస్థతో పాటు అన్ని ఏర్పాట్లు చేసినట్టు దేవా దాయ కమిటీ సభ్యులు తెలిపారు.



దక్షిణకాశీగా బాసిల్లుతున్న సిద్ధరామేశ్వర ఆలయం

భిక్కనూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): భారతదేశ పుణ్యక్షేత్రాలైన పిలువబడే కాశీ, రామేశ్వరం, శ్రీకాళహస్తి, వేములవాడ దేవాలయాలతో సమానంగా పిలువబడి దక్షిణకాశీగా బాసిల్లుతున్న మండలంలోని శ్రీ పార్వతి సిద్ధరామేశ్వర ఆలయం నిత్యం భక్తులతో కిటకిటలాడుతోంది. ఈ ఆలయాన్ని సిద్ధగిరి, రామగిరి అనే యోగి పుంగవులు చాలా వందల సంవత్సరాల క్రితమే నిర్మించారని, దోమకొండ సంస్థానాధీశులు సిద్ధరామేశ్వర ఆలయాన్ని ఇలవేల్పుగా చేసుకోని ప్రార్థించినట్లు చరిత్ర చెబుతోంది. సిద్ధగిరి, రామగిరి ఇరువురు ఈశ్వరుడి ఆలయాన్ని నిర్మించడంతో దినికి శ్రీసిద్ధరామేశ్వర ఆలయంగా పేరువచ్చినట్లు పూర్వీకులు చెబుతారు. ఆలయంలో బ్రహ్మోత్సవాలు, శివరాత్రి, శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు, జాతర నిర్వహిస్తారు. శ్రీ పార్వతి సిద్ధరామేశ్వర ఆలయంలో మాతా భువనేశ్వరిమాతా, కుమారస్వామి, దత్తాత్రేయ, హనుమాన్, వీరభద్ర, నవగ్రహ ఆలయాలున్నాయి. ఆలయంలోని మూలబావి ఎంతో పవిత్రమైనది. పాతాళగంగతో సమానంగా భావించే ఈ బావిలోని నీటితో ధీర్ఘకాలిక వ్యాదులు నయమవడంతో పాటు ఈ నీటితో స్నానం చేసి స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. మహాశివరాత్రికి ప్రత్యేక పూజల కోసం ఆలయంలో ఏర్పాట్లు చేశారు.

కోరికలు తీర్చే నందీశ్వరుడు

భీమ్‌గల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారమై కోరిన కోరికలు తీర్చే నందీశ్వరునిగా ప్రసిద్ధిగాంచారు. భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని నందిగల్లీలో గల నందీశ్వర ఆలయంలో రుద్రాదేవుడును వివాహం కాని వారు సంతానం కలగని వారు పూజిస్తే వివాహం, సంతానం జరుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో ప్రతినిత్యం భక్తులుహాజరై మొక్కులు తీర్చుకుంటారు. లక్ష్మీపరమేశ్వరులు ఆలయంలో వెలిసిన నందీశ్వరునిపై చెంతగల లింబాద్రిగుట్టపై గల శ్రీలక్ష్మీనరసింహస్వామి వారు వివాహానికి హాజరై కొలువుదీరినట్టు పురాణం చెబుతోంది. ఆలయంలోని శనీశ్వరునికి తడిబట్టలతో స్నానంచేసి మొక్కులు తీర్చుకుంటే అష్టశ్వర్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

ప్రతీ ఏటా వైభవంగా వేడుకలు

ప్రతీఏడాది శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నందీశ్వర ఆలయం వద్ద సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. శివరాత్రి మరుసటిరోజు అన్నదానం చేస్తారు. కార్యక్రమాలను వీక్షించేందుకు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరవుతారు.



భీమ్‌గల్‌లో పార్వతిపరమేశ్వరులు ఆశీనులైన నందీశ్వర ఆలయం



మాట్లాడుతున్న కులాచారి దినేష్

పోలింగ్ బూత్ ఏజెంట్లతో బీజేపీ వర్క్‌షాప్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్ ఏజెంట్లతో బీజేపీ నాయకులు వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని నిఖిల్ సాయి హోటల్‌లో మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో యువర్ వర్క్‌షాప్ నిర్వహించి పోలింగ్ ఏజెంట్లకు పలు సూచనలు, సలహాలు అందించారు. బీజేపీ, తపాస్ బలపర్చిన అభ్యర్థి మల్క కొమురయ్య, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి కార్యకర్తలు అందరూ సమష్టిగా పనిచేసి గెలిపించాలని సూచించారు. ఎన్నికల రోజు పోలింగ్ బూత్‌లో పాటించాల్సిన విధానాలపైన పోలింగ్ ఏజెంట్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్లు, మండల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి డివిజన్‌ను బైఫర్‌కేషన్ చేయాలి

● సీఎండీకి ఐఎన్‌టీయూసీ నాయకుల వినతి



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి డివిజన్ ఏర్పడి చాలా రోజులు అవుతున్నా బైఫర్‌కేషన్ చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సీఎండీ వరుణ్‌రెడ్డికి ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. వరంగల్‌లోని సీఎండీ కార్యాలయంలో మంగళవారం కలిసి డిచ్‌పల్లి డివిజన్ సమస్యలపై విన్నవించారు. డిచ్‌పల్లి డివిజన్‌కు సంబంధించిన ఓఎన్‌డీ స్టాఫ్‌ను నియమించాలని కోరారు. డిచ్‌పల్లి డివిజన్ నిజామాబాద్‌లో కొనసాగుతుందని డిచ్‌పల్లికి మార్చాలన్నారు. ఈ సమస్యపై సీఎండీ వరుణ్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్ పుదారి గంగాధర్ తెలిపారు. సీఎండీని కలిసిన వారిలో కంపెనీ సెక్రెటరీ జనరల్ శ్రీధర్, నాయకులు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్, వేణుగోపాల్‌రావు, సుధాకర్, సర్దార్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బేస్‌బాల్ జట్టు ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన జిల్లా బేస్‌బాల్ జట్టు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల సుద్దపల్లిలో మంగళవారం బేస్‌బాల్ జూనియర్ బాలబాలికల జిల్లా జట్టు క్రీడకారులను ఎంపికచేసినట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధుసుదన్‌రెడ్డి, సొప్పరి వినోద్‌లు తెలిపారు. ఈ ఎంపికైన జట్టు క్రీడాకారులు ఈ నెల 28 నుంచి మార్చి 2 వరకు గజ్వేల్‌లోని కేజీ టు పీజీ గ్రౌండ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల వైస్‌ప్రిన్సిపాల్ స్వప్న, ఎంపికైన వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జట్టు ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, వైస్ ప్రిన్సిపాల్ వనిత, పీఈటీ జ్యోత్స్న, కోచ్ మౌనిక, సంతోశ్‌లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాలో భాగంగా నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేసవిలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని టీజీఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాపెల్లి రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ సర్కిల్‌లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు మరో 2 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామని అదనంగా 77 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను మరో 91 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామన్నారు. గత మూడు నెలల నుంచి వేసవికాల ముందస్తు కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేసుకొని ముందుకు వెళ్తున్నామన్నారు. అన్ని ఫీడర్‌లు వేరువేరుగా ఉండటం వల్ల వినియోగదారులకు అంతరాయం ఉండదన్నారు. పీక్‌లోడ్ సమయాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్ తెలుసుకోవడానికి తప్పనిసరిగా టంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకుంటున్నామన్నారు. దీని ద్వారా పీక్‌లోడ్ పెరిగే ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచవచ్చన్నారు. సబ్‌స్టేషన్‌లో సూక్ష్మలోపాలను గుర్తించడానికి థర్మల్ ఇమేజింగ్ కెమెరాలను వాడుతున్నామన్నారు. సూక్ష్మలోపాలను వెంటనే సరిచేస్తూ అంతరాయాలు లేకుండా చేస్తున్నామన్నారు. వోల్టేజ్‌ను హెచ్చుతగ్గులు లేకుండా కెపాసిటర్ బ్యాంక్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఇప్పటికే 9 కెపాసిటర్ బ్యాంక్‌లు పెట్టడం జరిగిందన్నారు. వీటివల్ల సబ్‌స్టేషన్ లైన్‌లలో విద్యుత్ సరఫరా ఓవర్‌లోడ్ కాకుండా నియంత్రిస్తుందన్నారు. నష్టాలు చాలా వరకు తగ్గాయన్నారు. టెక్నికల్ నష్టాలు ఘననీయంగా తగ్గాయని పరికరాల మన్నిక చాలా పెరుగుతుందన్నారు. వేసవి కార్యాచరణకు అధికారులు పూర్తిగా సిద్ధమయ్యారని తెలిపారు.

పాఠశాలలో విద్యార్థులచే తల్లిదండ్రులకు పాదపూజోత్సవం

పెర్కిట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంద పాఠశాలలో మంగళవారం విద్యార్థులచే తల్లిదండ్రులకు పాదపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రుల పాదాలను కడిగి ఆ నీటిని నెత్తిన చల్లుకున్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను మనసారా ఆశీర్వదించారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ఈ రకమైన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు తల్లిదండ్రుల పట్ల భక్తిభావన పెరగడంతో పాటు చదువుపై శ్రద్ధ కనబరుస్తారని, ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ ముఖ్యమని అన్నారు. ప్రతీ ఏడాది పాఠశాలలో విద్యార్థులచే తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహిస్తున్నామని భారతదేశ సాంస్కృతికి చిహ్నంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి విజయవంతం కావడానికి ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేసింది

● ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం యావత్ తెలంగాణ ప్రజలను మోసం చేసిందని అధికారం కట్టబెడితే ప్రజలకు అన్యాయం జరుగుతుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్‌లోగల పద్మశాలీ సంఘం భవనంలో పట్టభద్రులు, ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై భరోసా లేకుండా చేసిందన్నారు. నిరుద్యోగులను నిండా ముంచిన కేసీఆర్‌కు ఏ గతి పట్టిందో రేవంత్‌రెడ్డికి అదే గతి పడుతుందన్నారు. ప్రభుత్వం ఇస్తానన్న ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డలకు ఉచిత ఎలక్ట్రిక్ స్కూటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.6వేల కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని బకాయిలు విడుదల చేసేంతవరకు బీజేపీ పార్టీ ప్రభుత్వాన్ని విడిచిపెట్టదని హెచ్చరించారు. నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావులు ఆలోచించి ఓటు వేయాలన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయి గోసపడవద్దని అన్నారు. నిరుద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం మెడలు వంచి అమలయ్యేలా చూడాలంటే మండలిలో ప్రశ్నించే గొంతుకలైన బీజేపీ అభ్యర్థులు మల్కకొమురయ్య, అంజిరెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, పట్టభద్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను బయటపెట్టిన సీఎం

● వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయని బీజేపీ ఎమ్మెల్యేలకు భయం ● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జిల్లాకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్, బీజేపీల కుట్రలను బయటపెట్టడంతో బీజేపీ నాయకుల్లో ఒక్కసారిగా భయం పుట్టుకుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 14 నెలల్లో బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ, రైతుల రుణమాఫీ, రైతులకు బోనస్, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు, గృహజ్యోతి వంటి పథకాలను ప్రవేశపెడితే యువతకు స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తే పట్టభద్రులు ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేస్తారని భయపడి బీజేపీ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేష్‌రెడ్డిలు ఏమి మాట్లాడాలో అర్థంకాని స్థితిలో సీఎం రేవంత్‌రెడ్డిపై అబద్ధపు విమర్శలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వానికి పట్టభద్రులకు సమన్వయం చేసేలా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. నరేందర్‌రెడ్డి గెలిస్తేనే పట్టభద్రుల సమస్యలు నేరుగా సీఎం దగ్గరికి వెళ్తాయని ఇతర పార్టీల వారు గెలిస్తే సమస్యలు అలాగే ఉంటాయని, పట్టభద్రులు నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు రామర్తిగోపి, అబుద్‌బిన్ హుందాన్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న విపుల్‌గౌడ్

కాంగ్రెస్ అభ్యర్థి తరపున యూత్ కాంగ్రెస్ ప్రచారం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి తరపున నిజామాబాద్‌లో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్‌గౌడ్ మంగళవారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని, పట్టభద్రులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున పట్టభద్రుల ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డి గెలిస్తే పట్టభద్రుల సమస్యలను నేరుగా సీఎం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని కావున పట్టభద్రులు ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తూంపల్లి మహేందర్, ఎడ్ల లక్ష్మణ్, రమేష్, మోహన్, రాజు పాల్గొన్నారు.

బీసీ ఎమ్మెల్సీల విజయం ఖరారైంది

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నిజామాబాద్ పర్యటనలో మాట్లాడిన మాటలు పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఓటమిని ఖాయం చేశాయని బీసీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం తథ్యమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం రాత్రి నగరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీ అభ్యర్థులే గెలవబోతున్నారని బీసీ అభ్యర్థుల విజయం ఖరారైందని అన్నారు. అందుకు నిజామాబాద్‌లో జరిగిన పట్టభద్రుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలే నిదర్శనమన్నారు. బీసీ పట్టభద్రులు, బీసీ ఉపాధ్యాయులు బీసీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్, విక్రమ్‌గౌడ్, నరాల సుధాకర్, మాడవేడి వినోద్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

28న ఛలో ఢిల్లీ సదస్సును విజయవంతం చేయండి



మాట్లాడుతున్న డివిజన్ కార్యదర్శి వెంకన్న

మోపాల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 28న ఢిల్లీలో చేపట్టిన సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి వెంకన్న కోరారు. మంగళవారం మండలంలోని రాణాకుర్దు గ్రామంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, ఫాసిస్ట్, కార్పొరేట్, మతోన్మాద విధానాలను వ్యతిరేకిద్దాం ప్రజాస్వామ్యం, లౌకికవాదం పోరాడుదామని అన్నారు. మోదీ ప్రభుత్వం ఏడాది బడ్జెట్ ముందు జనవరి 31న విడుదల చేసిన ఆర్థిక సర్వే పత్రం వెల్లడించిన సమాచారం చూడాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని మండిపడ్డారు. కేంద్రం అవలంభిస్తున్న ఈ చర్యలకు నిరసనగా సీపీఐఎంఎల్ ప్రజాపంథ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సభ్యులు సాయన్న, గంగామళ్లు, నారాయణ, మురళి, కిషన్, గణేష్, తదితరులు ఉన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

● తహసీల్దార్‌కు వీడీసీ సభ్యుల వినతి

ముప్కాల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) బాల్కొండ కేంద్రంలోని మోడల్ స్కూల్ వెనక గల స్థలంలో దర్గా పేరు మీద ఆక్రమణకు గురవుతుందని వీడీసీ సభ్యులు మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అక్రమణకు గురైన స్థలంలో జేసీబీ సహాయంతో భూమి చదును చేశారని, గోడ నిర్మాణం చేపట్టారని, గత ఎనిమిది నెలల క్రితం వీడీసీసభ్యులకు ఆ స్థలంలో నిర్మాణాలు తొలగిస్తామని చెప్పినప్పటికీ తొలగించక పోగా అందులో మళ్ళీ నిర్మాణాలు కొనసాగిస్తున్నారని, జెండాలు పతి గ్రామాల్లో అలజడి సృష్టించే విధంగా ప్రవర్తిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని వీడీసీ సభ్యులు అధికారులను కోరారు.



టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకున్న మద్యం సీసాలు

సారంగాపూర్ బెల్ట్‌షాప్‌పై టాస్క్‌ఫోర్స్ దాడి

● రూ.18వేల మద్యం స్వాధీనం

ఖిల్లా,ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి):నగర శివారు ఆరవటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని సారంగపూర్ బెల్ట్‌షాపుపై మంగళవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసి సుమారు 18వేల 590రూపాయల మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ అంజయ్య తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇంచార్జీ పోలీసు కమీషనర్ సింధూశర్మ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది,స్పెషల్‌పార్టీ సిబ్బంది బెల్ట్‌షాప్‌పై దాడి చేశారన్నారు. ఈ దాడిలో బీర్లు46, నాకౌట్‌బీర్లు 12, రాయల్‌గ్రీన్, ఆఫీసర్‌చాయిస్, మెక్‌డొనాల్డ్, మ్యాజిక్‌మోమెంట్, విస్కి బాటిళ్లు లభించాయన్నారు. వీటిని స్వాధీనం చేసుకుని తదుపరి చర్య నిమిత్తం ఆరవటౌన్ పోలీసు ఎస్ఐకు అప్పగించారు.

1000 లీటర్ల కల్లు స్వాధీనం

ఖిల్లా, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో గల ఓ కల్లు డిపోపై టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ అంజయ్య సిబ్బందితో దాడి చేశారు. ఇన్‌చార్జి పోలీసు కమిషనర్ సింధూశర్మ ఆదేశాల మేరకు ఖచ్చితమైన సమాచారంతో కల్లు డిపోపై దాడి చేశారు. ఈ దాడిలో నిలువ ఉంచిన 1000లీటర్ల కల్లును స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు బండారీ రవిగౌడ్‌ను అదుపులోకి తీసుకుని ఆయనపై కేసు నమోదుకు మూడో టౌన్ ఎస్సైకి అప్పగించారు.



ప్రవీన్ కుమార్‌ను సన్మానిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

టీయూ ప్రిన్సిపాల్‌ను సన్మానించిన విద్యార్థి సంఘాల నాయకులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియామకమైన డా.మామిడాల ప్రవీణ్ కుమార్‌ను ఎన్ఎస్‌యూఐ, గిరిజన శక్తి విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం కలిసి సన్మానించారు. కళాశాలలో నెలకొన్న సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరం చేయాలని విద్యార్థి నాయకులు ప్రిన్సిపాల్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకుడు సాగర్, గిరిజన శక్తి విద్యార్థి నాయకుడు శ్రీను రాథోడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయానికి హారతి డ్రమ్ బహూకరణ



శివాలయానికి హారతి డ్రమ్‌ను బహూకరిస్తున్న గంగాధర్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్‌పూర్ శివాలయానికి హారతి డ్రమ్‌ను గ్రామానికి చెందిన ఆర్టీసీ బొల్లరం గంగాధర్ మంగళవారం బహూకరించారు. స్వామి వారికి హారతి సమయంలో డ్రమ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో బహూకరించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు గంగాధర్‌ను అభినందించారు.

హనుమాన్ ఆలయానికి మైక్‌సెట్ వితరణ

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్‌పూర్ గ్రామ హనుమాన్ ఆలయానికి పాటల మైకుప్లేయర్ సెట్‌ను రాచర్ల భూమయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సాయిలు వితరణ చేశారు. దీంతో ఆయనను పలువురు అభినందించారు.

శివరాత్రి వేడుకలకు ఆలయాల ముస్తాబు



శివరాత్రి వేడుకలకు ముస్తాబైన కాశీ విశ్వనాథ ఆలయం


డిచ్‌పల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పురస్కరించుకొని మండలంలోని ధర్మారం ఉమామహేశ్వర ఆలయంతో పాటు మండల కేంద్రంలోని స్ఫటిక లింగేశ్వర స్వామి ఆలయం, లింగసముద్రంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయాలు సర్వంగ సుందరంగా ముస్తాబు చేశారు. ధర్మారం(బి) ఉమామహేశ్వర ఆలయంలో బుధవారం తెల్లవారు జామున అభిషేక అర్చనలు నిర్వహించనున్నారు. ఎనిమిది గంటలకు ఉమామహేశ్వర స్వామి కల్యాణం, భజన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ ఛైర్మన్ రావుల బ్రహ్మానందం పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. బుధవారం అర్ధరాత్రి శివపార్వతులు కల్యాణం లింగోద్భవ అభిషేక అర్చన కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిపారు. 27వ తేదీన గురువారం 11గంటలకు స్వామి వారికి అన్నపూజ అలంకర మహా హారతి కార్యక్రమాలు ఉంటయాని భక్తులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. మండల కేంద్రంలోని కాశీ విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ప్రతినిధి ఇసుక రాజారం కోరారు. శివరాత్రి సందర్భంగా లింగసముద్రం గ్రామంలో జరిగే రథోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా.రేకులపల్లి భూపతిరెడ్డి హాజరవుతారని కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు పేర్కొన్నారు.



చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.230	రూ. 250



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.89500	రూ.82600	రూ.1015

సినిమా గైడ్ నిజామాబాద్



పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : చావా (హిందీ) (11.00, 1.40, 4.40, 7.30, 10.20)
స్క్రీన్-2 : మజాకా (1.45, 4.40, 7.30, 10.20)
స్క్రీన్-3 : రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (11.00, 4.40, 10.20)
: తండేల్ (1.45, 7.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : చావా (హిందీ) (10.05)
: మజాకా (1.25)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (4.30, 7.40, 10.50)
స్క్రీన్-2 : మజాకా (10.00, 4.15)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (1.05)
: చావా (హిందీ) (7.20, 10.40)
స్క్రీన్-3 : రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (9.40)
: చావా (హిందీ) (12.50)
: తండేల్ (4.10, 10.20) : మజాకా (7.15)
స్క్రీన్-4 : ఓయ్ (10.05)
: జాబిలమ్మ నీకు అంత కోపమా (1.30)
: చావా (హిందీ) (4.20) : సంక్రాంతికి వస్తున్నాం (7.40)
: మజాకా (10.40)

దేవి: మజాకా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : చావా (హిందీ) (11.00, 2.00, 6.00, 9.00)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : తండేల్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్